నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, ఆదివారం 12 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

ప్రచారం ముగిసింది

- ప్రముఖుల రాకతో హోరెత్తిన ఎంపీ ఎన్నికల సమరం
- ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రెండ్రోజులు గులాబీ బాస్ కేసీఆర్..
- కొత్తగూడెంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా..
- కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సినీహీరో వెంకటేశ్ ప్రచారం

ఖమ్మం, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నెలరోజులపాటు హోరాహోరీగా సాగిన లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మార్చి 15వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామినేషన్ల పత్రాలను అధికారులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడిజిల్లాలో రెండ్రోజుల పాటు బస్సుయాత్ర చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ పర్యటనతో బీఆర్ఎస్ శ్రేణులు నూతనోత్సాహంతో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తోపాటు ఆ పార్టీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, మదన్‌లాల్, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగూడెం కేంద్రంగా బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సినీ హీరో వెంకటేశ్ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపును కోరుతూ ఖమ్మం నగరం, కొత్తగూడెం పట్టణాల్లో రోడ్‌షో నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ అభ్యర్థి సీతారాంనాయక్ గెలుపు కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కొత్తగూడెం కేంద్రంగా సభలను ఏర్పాటు చేసి ప్రసంగించారు. తాండ్ర వినోద్‌రావు నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొని రోడ్‌షో నిర్వహించారు.

మాలోతు కవితను గెలిపించండి

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్
టేకులపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ

టేకులపల్లిలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, లక్కినేని

టేకులపల్లి, మే 11 : పార్లమెంటరీ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇలెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రి నాయక్ కోరారు. శనివారం 36 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కవిత విజయాన్ని కాంక్షిస్తూ హరిప్రియ నాయక్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి కారు గుర్తుకు ఓటు వేసి కవితను గెలిపించాలని కోరుతూ ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, నాయకుడు లక్కినేని సురేందర్‌రావు మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గ ప్రజల సమస్యల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే వ్యక్తి కవిత అని, ఆమెను గెలిపించుకుంటే మన సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాలది అప్పారావు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, ఇస్లావత్ బాలునాయక్, రాము, కిషన్, భూక్య లాలునాయక్, బోడ జ్యోతి, ఆమెడ రేణుక, భూక్య పాపానాయక్, కుమ్మరి కిరణ్, తేజవత్ రవి పాల్గొన్నారు.

భద్రాద్రి రామాలయ ఏఈవో సస్పెన్షన్

సస్పెండ్ అయిన దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్

భద్రాచలం, మే 11 : భద్రాచలం దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జానకీ సదనం నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామంటూ తమను మోసం చేశారని ఏఈవోపై హైదరాబాద్‌కు చెందిన ట్రస్టు సభ్యులు దేవస్థానం ఈవో రమాదేవికి ఫిర్యాదు చేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతో ఈవో రమాదేవి దేవాదాయ శాఖ కమిషనర్, కలెక్టర్ ప్రియాంక ఆలకు ఈ ఉదంతంపై నివేదిక అందజేశారు. దీనిపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏఈవోకు సైతం ఈవో మెమో జారీ చేశారు. క్షేత్రస్థాయిలో విచారించేందుకు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఎన్ఎండీ కృష్ణవేణిని విచారణాధికారిగా కమిషనర్ నియమించారు. ఈ నెల మొదటి వారంలో కృష్ణవేణి భద్రాద్రి దేవస్థానం కార్యాలయం, హైదరాబాద్‌కు చెందిన ట్రస్టు సభ్యులు, ఇందులో పరోక్షంగా ఉన్న పలువురిని విచారించిన తర్వాత నివేదికను కమిషనర్‌కు అందజేశారు. దీంతో ఏఈవోను సస్పెండ్ చేస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి.

మీ సేవకుడిని కాపాడుకోండి

- అందరివాడినైన రైతుబిడ్డను ఆశీర్వదించండి
- రాజకీయాలకతీతంగా ఆదరించండి
- మళ్లీ పార్లమెంట్‌కు పంపిస్తే మరింత అభివృద్ధి చేస్తా
- నా జీవితం జిల్లా ప్రజలతోనే ముడిపడి ఉంది
- కాంగ్రెస్‌కు ఓటేస్తే నిష్ఫలమే..
- ఖమ్మం ఎంపీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర, జడ్పీ చైర్మన్ కమల్‌రాజు తదితరులు

ఖమ్మం, మే 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజల లక్ష్యం.. ఆశయం నెరవేరాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో రైతుబిడ్డగా అందరివాడినైన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి మూడోసారి పార్లమెంటుకు పంపాలని బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లను కోరారు. శనివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ జిల్లా రైతుబిడ్డగా అందరివాడిగా అందరి ఆప్యాయతల మధ్య వారితో మమేకమై ఉంటూ ప్రజలకు అండదండగా నిత్యం నిలిచిన తనను దండిగా దీవించి, మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మూడోసారి కూడా తనను పార్లమెంటుకు కచ్చితంగా పంపిస్తారనే నమ్మకం ఉందని, పార్లమెంట్‌కు వెళ్లి జిల్లా అభివృద్ధికి మరింత కృషిచేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలపై జిల్లావాణిని పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తానని అన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్న తనను కాపాడుకోవాల్సిన బాధ్యత ఖమ్మం జిల్లా ప్రజలపైనే ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాలు, జిల్లా ప్రయోజనాలు కాపాడాలంటే తప్పనిసరిగా పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచే తన తండ్రి నామా ముత్తయ్య పేరు మీద ట్రస్టు పెట్టి పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేసిన సంగతి ప్రజలందరికీ తెలుసునని అన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నానని తెలిపారు. ఒక వైపు నామా ముత్తయ్య ట్రస్టు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్‌గా, ట్రస్టీగా, మరోవైపు రాజకీయాల్లో పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. ఖమ్మం జిల్లాలో 8వేల కోట్ల రూపాయల విలువైన జాతీయ రహదారులు తీసుకొచ్చిన ఘనత తనకే దక్కుతుందని చెప్పారు. రెండుసార్లు గెలిపించి పార్లమెంట్‌కు పంపితే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలపైన, రైల్వే ప్రాజెక్టులు, ఇతర పెండింగ్ ప్రాజెక్టులు, రావాల్సిన నిధుల పైన పోరాటం చేసి సాధించానని చెప్పారు. దేశంలో ఏ ఎంపీ చేయని విధంగా ఖమ్మం జిల్లాలో ఒక లక్షా 55వేల గ్యాస్ కనెక్షన్లు, 60 వేల ఇజ్జత్ రైల్వేపాసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. దేశంలో ఏ ఎంపీకి దక్కని గుర్తింపు ఖమ్మం జిల్లా బిడ్డనైన తనకు దక్కిందని, పార్లమెంట్‌కు ఎక్కువశాతం రోజులు హాజరై, అధిక ప్రశ్నలు అడిగి, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అరుదైన గుర్తింపు పొంది జిల్లా ఖ్యాతిని దేశంలో కీర్తింపజేశానని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రజల మనసు గెలుచుకున్న నామా నాగేశ్వరరావును మళ్లీ గెలిపించి పార్లమెంట్‌కు పంపి మరింత అభివృద్ధికి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు జిల్లా ఓటర్లు సంసిద్ధంగా ఉన్నారని, ఎన్నికల కోసం వేచి చూస్తున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లాకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ఎంతో చేశారని, రాష్ట్రంలో ఉన్న ఒకే ఒక్క రాజ్యసభ సీటు ఉంటే దాన్ని కూడా ఖమ్మం జిల్లాకు చెందిన బీసీ బిడ్డకు ఇచ్చిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఖమ్మం, మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ గెలువబోతుందని, తెలంగాణలో 12 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ప్రజల లక్ష్యం నెరవేరాలంటే మంచిమనిషి నామాను మళ్లీ పార్లమెంటుకు పంపించాలని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ప్రజాలక్ష్యం నెరవేరదని స్పష్టంచేశారు. నామా ప్రశ్నించే గొంతుక అని, ఆయన పార్లమెంట్‌లోనే ఉండాలని, ఈ విషయం ప్రజలు గుర్తించి ఆలోచించి నామాకు పట్టం కట్టాలని కోరారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన నామా పెద్దఎత్తున సేవ చేస్తున్నారని చెప్పారు. ఈ విషయం టీడీపీ శ్రేణులు గుర్తించి కాంగ్రెస్‌కు ఓటు వేయకుండా కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, మైనారిటీ నాయకులు తాజుద్దీన్, బిచ్చాల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఓటుహక్కు వినియోగించుకోనున్న 16,31,039 మంది ఓటర్లు
- 1,896 కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్..
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 11 : కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి మీడియా, రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 97.50 శాతం ఓటర్లకు ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశామన్నారు. ఇంకా 40,819 మందికి స్లిప్‌లు ఇవ్వాల్సి ఉన్నప్పటికి ఆయా ఓటర్లు బీఎల్‌వోలు వెళ్లిన సమయంలో లేకపోవడంతో వారికి అందించలేదన్నారు. ఇలాంటి ఓటర్ల స్లిప్‌లను సీల్ చేశామని, ఓటరు జాబితాలో పేరు ఉండి స్లిప్ అందని వారు కూడా ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి ఓటరు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డుతో పోలింగ్‌కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. మే 13వ తేదీన ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగనుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు 8,199 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని తెలిపారు. ఖమ్మం పార్లమెంట్ బరిలో 35 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా ఇందులో నలుగురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. మిగతా 31 మంది వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీలతో సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 1,896 పోలింగ్ కేంద్రాలు, 1,084 లోకేషన్లు ఉన్నాయని వీటిలో విధులు నిర్వహించేందుకు 7,584 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపీఓలను నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన బ్యాలెట్ యూనిట్లు-7,034, కంట్రోల్ యూనిట్లు-2,323, వీవీప్యాట్స్-2,634 ఆయా నియోజకవర్గాల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలకు తరలించామని తెలిపారు. ఎన్నికల విధుల ఉత్తర్వులు అందుకున్న పీవో, ఏపీవో, ఓపీవోలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఆదివారం ఉదయం 7గంటల వరకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 16,31039 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,87,160 మంది పురుషులు, 8,43,749 మంది మహిళలు, 130 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. 18 నుంచి 19 ఏళ్ల ఓటర్లు 50,747 మంది ఉన్నారన్నారు. ఓటరు స్లిప్పులు కేవలం ఓటర్లకు సమాచారం మాత్రమేనని, పోలింగ్ కేంద్రానికి వచ్చేప్పుడు ఎన్నికల సంఘం సూచించిన ఏదేని గుర్తింపుకార్డు తీసుకపోవాల్సి ఉంటుందని తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుంచి పోలింగ్ జరిగే సోమవారం సాయంత్రం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు, బార్ ఎండ్ రెస్టారెంట్లు 48 గంటలపాటు మూసివేయాలని సూచించారు. జిల్లాలో పోలింగ్ విధులకు 4,291 మంది రాష్ట్ర, కేంద్ర బలగాల పోలీస్ యంత్రాంగం విధులు నిర్వహిస్తుందన్నారు. ప్రత్యేకంగా గుర్తించిన 86 పోలింగ్ కేంద్రాలలో కేంద్ర బలగాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు.

చివరి దశ ర్యాండమైజేషన్ పూర్తి

భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 11 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు చివరి దశ ర్యాండమైజేషన్ పూర్తయిందని భద్రాద్రి కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. భద్రాద్రి జిల్లాలో జరిగే ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను ఖమ్మం కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి కోల్టే.. ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఆన్‌లైన్‌లో శనివారం తుది దశ ర్యాండమైజేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,105 పోలింగ్ కేంద్రాలకు.. 1,105 బృందాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. మార్గదర్శకాల ప్రకారం అదనంగా 20 శాతం సిబ్బందిని, ఐదు నియోజకవర్గాల్లో 225 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, రంగ ప్రసాద్, ఎన్ఐసీడీఐవో సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉదయం 7 నుంచి 4 గంటల వరకే పోలింగ్

భద్రాద్రి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని 169 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

ఖమ్మం కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ వీపీ గౌతమ్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం రూరల్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం పొన్నెకల్ శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం, పాలేరు అసెంబీ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, అన్ని సెగ్మెంట్ల రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో సెక్టార్లు, పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి టేబుళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సెగ్మెంట్లు కేటాయించిన ప్రదేశాలకు సులభంగా వెళ్లేలా కలర్ కోడ్ అనుసరించేలా చూడాలన్నారు. బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులు, సూక్ష్మ పరిశీలకులు భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, తహసీల్దార్ సీహెచ్.స్వామి, విశ్వనాథ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయండి

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

గొందిగూడెం ఆశ్రమ పాఠశాల తరగతి గదులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

అశ్వాపురం, మే 11 : విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఆశ్రమ పాఠశాలల్లోని మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన మైనర్ రిపేర్లు, ప్యాచ్ వర్క్స్, డ్యూయల్ డెస్క్ మరమ్మతు పనులు పూర్తిస్థాయిలో చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో స్పెషలాఫీసర్లు, హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులు, డార్మెటరీని ఆయన కలియతిరిగి పరిశీలించారు. ఆశ్రమ పాఠశాలలోకి క్రిమికీటకాలు రాకుండా మెస్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు నిద్రించే నాలుగు బెడ్లకు కలిపి ఒక ఫ్యాన్ కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ వంటివి వేరుగా ఉండాలని, ఈ పనులన్నీ 20వ తేదీ నాటికి పూర్తి కావాలన్నారు. ఆయన వెంట స్పెషల్ ఆఫీసర్, డీటీ ఆర్‌వోఎఫ్ఆర్ శ్రీనివాస్, అగ్రిక ల్చర్ ఏడీ భాస్కరన్, గొందిగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రామారావు ఉన్నారు.

రామయ్య బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.1.89 కోట్లు

భద్రాచలం, మే 11 : భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ ద్వారా దేవస్థానానికి వివిధ మార్గాల్లో రూ.1,89,61,124 ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి శనివారం తెలిపారు. సెక్టార్ టికెట్ల విక్రయం ద్వారా రూ.93,01,450, పరోక్ష సేవలు రూ.5 వేల టికెట్ల విక్రయం ద్వారా రూ.2.85 లక్షలు, రూ.1,116 టికెట్ల ద్వారా రూ.4,39,704, అంతరాలయ అర్చన సేవల ద్వారా రూ.91,740, తలంబ్రాల బుకింగ్ ద్వారా రూ.75,930, కార్గో సేవల ద్వారా రూ.23.20 లక్షలు, కౌంటర్లలో అమ్మకాల ద్వారా రూ.7,87,950, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.56,59,350 ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు.

- సీపీ సునీల్ దత్

రెండ్రోజులు 144 సెక్షన్ అమలు

భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు

మామిళ్లగూడెం, మే 11 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ విధించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, గుంపులుగా గుమిగూడి ప్రచారాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం గడువు ముగిసిన తర్వాత ఐదుగురికి మించకుండా మైకులు, స్పీకర్లు లేకుండా ఇంటింటికి ప్రచారం చేసుకునే వారికి ఈ ఆంక్షలు వర్తించవని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, ఫారెస్ట్, కేంద్ర బలగాలు, హోంగార్డులు, ఎస్పీవోలకు నిషేధ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ఈ విషయంలో అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరం వరకు ఆత్మరక్షణ పేరుతో కర్రలు, తుపాకులు, మారణాయుధాలతో సంచరించొద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో షామియానాలు, పందిళ్లు వంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి లేదన్నారు. వ్యక్తులు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం, చట్టబద్ధమైన అధికారానికి భంగం కలిగించే లేదా ధిక్కరించే నేరానికి దారితీసే అవకాశం ఉన్న ఏదైనా ప్రసంగం నిషేధమని ఆయన పేర్కొన్నారు.

భద్రాద్రి జిల్లాలో 14 వరకు
భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, మే 11 : భద్రాద్రి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులోకి తెచ్చినట్లు జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా 14వ తేదీ సాయ